క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 27 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఆరోగ్య భద్రత పెరిగిందన్నారు. చెక్కులను మంజూరు చేసినందుకుగాను సీఎంకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



కందుకూరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

కందుకూరు: స్వర్గీయ ఎన్‌టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన అభిమానులు ఎగ్గిడి సత్తయ్య, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన తెలుగు జాతికి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్‌టీఆర్ చూపిన మార్గంలోనే అందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్ద రామయ్య, అభిమానులు బొమ్మరాజు మల్లేశ్, గణపురం అంజయ్య, గడ్డల రాములు, గడిగ మహేందర్, గాదె సత్తయ్య, దాసు, గణేశ్, రాయికంటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

శంషాబాద్ రూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సీజీఎం పాండ్యానాయక్ అన్నారు. మండలంలోని పెద్దషాపూర్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన నూతన ఫీడర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ రామ్మోహన్, డీఈ రత్నాకర్‌రావు, డీఈ(కన్‌స్ట్రక్షన్) చంద్రశేఖర్, డీఈ (ప్రొటెక్షన్) భాస్కర్‌రావు, ఏడీఈ రమేష్, ఏఈలు షేక్ బాషా, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

శంషాబాద్ రూరల్: టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ డైరీ, నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం ఎంఆర్సీ భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి కృష్ణయ్య, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ కె.విద్యావతి, జిల్లా కార్యదర్శి సి.భాగ్యమ్మ, కార్యవర్గ సభ్యులు శంకర్, మండల ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, శివకుమార్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయడం ఇష్టం

ఎల్‌బీనగర్: ప్రజాసేవ, సమాజసేవ చేయడం తనకెంతో ఇష్టమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం మధుర రెసిడెన్స్‌లో నిర్వహించిన వనస్థలి క్రాంతిక్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో లయన్ క్లబ్ నిర్వహించే అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. అనంతరం నిరుపేద పిల్లల కోసం రూ.10 వేలు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ సభ్యులు వాసుదేవరావు, సాధు కృష్ణకిషోర్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

మొయినాబాద్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి చేర్చాలని డాక్టర్ శివ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ–ఏకి మార్చాలని చేపడుతున్న ముదిరాజ్ ప్రజా చైతన్య బస్సు యాత్ర శనివారం చేవెళ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, శ్రీనివాస్, జనార్దన్ పాల్గొన్నారు.

అధ్వాన దారులతో అవస్థలు

- రెండునెలల క్రితం అధునాతన యంత్రాలతో గుంతలు పూడ్చే విధానం ప్రారంభం
- ఆ తర్వాత అటకెక్కిన రోడ్ల మరమ్మతులు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



పెద్దమంగళారం రోడ్డు పరిస్థితి

మొయినాబాద్: నూతన టెక్నాలజీతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చేస్తాం. అధునాతన ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్, పాట్‌హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ యంత్రాలతో రోడ్లపై గుంతలు పూడ్చి రెండేళ్లలో రోడ్లను అభివృద్ధి చేస్తాం.. గత నవంబర్ 11న చిలుకూరు రోడ్డులో నూతన టెక్నాలజీ యంత్రాలతో గుంతలు పూడ్చే విధానాన్ని ప్రారంభించిన సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన మాటలివి.

ఆర్భాటంగా ప్రారంభించి..

నూతన టెక్నాలజీతో రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కార్యక్రమం అటకెక్కింది. అమెరికాలో అమలవుతున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ దేవాలయం వెళ్లే రోడ్డులో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్, పాట్‌హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ విధానంతో అధునాతన యంత్రాలతో గుంతలు పూడ్చే విధానాన్ని మొదలుపెట్టారు. ఈ యంత్రాలతో రోజుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం గుంతలు పూడ్చవచ్చు. రాష్ట్రంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఏర్పడిన గుంతలన్నీ యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభోత్సవం సందర్భంగా చెప్పారు. అయితే ఆ తర్వాత రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ఎక్కడా జరగడం లేదు. ఆరంభశూరత్వంగా ప్రారంభించిన కార్యక్రమం కొనసాగకుండా మరుగునపడింది. ఆ రోజు తీసుకొచ్చిన గుంతలు పూడ్చే నూతన టెక్నాలజీ యంత్రం సైతం కనిపించకుండా పోయింది.

అధికారులకే తెలియని వైనం..

నూతన టెక్నాలజీ యంత్రాలతో రోడ్లపై గుంతలు పూడ్చే విధానం ఎందుకు కొనసాగడంలేదో అధికారులకే తెలియకుండా పోయింది. ప్రతిష్టాత్మకంగా ఈ విధానాన్ని ప్రారంభించిన అధికారులు ఆ తర్వాత ఎందుకు వదిలేశారో తెలియడం లేదు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను వివరణ కోరగా.. తమకు తెలియదని ఉన్నతాధికారులనే అడగాలని సమాధానమిస్తున్నారు.

అడుగడుగునా గుంతలే

నూతన టెక్నాలజీతో గుంతలు పూడ్చే యంత్రంతో చిలుకూరు, హిమాయత్‌నగర్ గ్రామాల వద్ద కొద్దిదూరం గుంతలు పూడ్చారు. అదే రోడ్డుపై ఇంకా చాలా గుంతలు ఉన్నా వాటిని మాత్రం ఇప్పటివరకు పూడ్చలేదు. మంత్రి వచ్చిన రోజే అధికారులు హడావిడిగా యంత్రంతో రెండు, మూడు గుంతలు పూడ్చి ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో చిలకూరు రోడ్డులో సుమారు పది కిలోమీటర్ల దూరం అడుగడుగునా గుంతలే ఏర్పడ్డాయి. అదేవిధంగా మండలంలోని చాలా గ్రామాల రోడ్లు పూర్తిగా గుంతల మయంగా మారి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



యంత్రంతో గుంతలు పూడ్చుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి(ఫైల్)

మరమ్మతులు చేపట్టాలి



రెండు నెలల క్రితం రోడ్లపై ఏర్పడి గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిలుకూరు వద్ద ప్రారంభించారు. ఇప్పటివరకు రోడ్లపై గుంతలు పూడ్చలేదు. ఆ రోజు తెచ్చిన యంత్రం మళ్లీ కనిపించకుండా పోయింది. రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదు. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– గున్నాల గోపాల్‌రెడ్డి, చిలుకూరు

బీజేపీ జెండా ఎగురవేద్దాం

కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్య గౌడ్

మహేశ్వరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను గెలిపించుకొని గడికోటపై బీజేపీ జెండా ఎగురవేద్దామని కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల నియమితులైన మండల అధ్యక్షుడు తెల్గమల్ల యాదిష్‌కి మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించుకొని మహేశ్వరంపై బీజేపీ జెండా ఎగురవేయాలని కోరారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. అంతకు ముందు వివిధ గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు నూతనంగా నియమితులైన యాదిష్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంటరీ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దేశ్యా నాయక్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసాని వెంకటేశ్, బీజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాసాని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు కుండె వెంకటేశ్, సుదర్శన్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు బస్వ శ్రీశైలం గౌడ్, బుగ్గని శంకర్, కాసుల సురేశ్, కొండ రఘుపతి, మాజీ మండల అధ్యక్షుడు మాధవచారి, మండల ప్రధాన కార్యదర్శి నందీశ్వర్, పార్టీ సీనియర్ నాయకుడు ముత్యం, శ్రావణ్, యాదయ్య, అంజయ్య, కృష్ణ, ఉపేందర్, మంద యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం బీజేపీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని.. అప్పుడే రోడ్డు ప్రమాదాలను విజయవంతంగా అరికట్టే అవకాశం ఉందని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో క్యాబ్ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘనల కారణంగా జరిగే అనర్థాలతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ప్రమాదాల నివారించాలంటే ట్రాఫిక్ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కారణంగా వివిధ దేశాలు, ఆయా నగరాల నుంచి వచ్చే పర్యాటకులు, ప్రయాణికులను అతిథులుగా గుర్తించి మర్యాదగా ప్రవర్తించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

కొనసాగుతున్న భూముల సర్వే

తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: సాగుకు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సుభాన్‌పూర్, నాగిరెడ్డిపల్లి, నాగారం, గంగారం, శ్రీనగర్ గ్రామాల్లో రైతు భరోసా పథకానికి సంబంధించిన సాగుకు యోగ్యత ఉన్న, యోగ్యత లేని భూములు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యత కలిగిన భూములకు ప్రభుత్వం రైతు భరోసా వస్తుందన్నారు. సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా దక్కదన్నారు. ప్రధానంగా రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. సాగు యోగ్యతలేని భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో ఫీల్డ్ సర్వే నిర్వహించి రైతు భరోసా పథకం నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో పలు భూములు, రికార్డులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్వర్ణకుమారి, పావని, సీనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సుభాన్‌పూర్‌లో భూరికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

కేటీఆర్.. అబద్ధాలు మానుకో



షాబాద్‌లో రైతు దీక్ష చేసిన స్థలాన్ని కల్లాపి చల్లి శుభ్రం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: కేటీఆర్ అబద్ధపు మాటలు, ప్రజలను మోసం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో కేటీఆర్ నిర్వహించిన రైతు దీక్ష, ధర్నా నిర్వహించిన సభ స్థలంలో చీపుర్లతో శుభ్రం చేసి కల్లాపి చల్లి నేలను శుద్ధి చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసాగా ఎకరాకు ఏటా 12 వేల రూపాయలు అందిస్తామన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని హామీనిచ్చారు. గతంలో ఎప్పుడు లేని విధంగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిందన్నారు. అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు గౌరీ సతీష్, ఎన్.రాంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకుంటూ ఉనికిని కాపాడుకునేందుకు దొంగదీక్షలు చేస్తున్నారని వాటిని మానుకోవాలని సూచించారు. గత 10 ఏళ్లలో నిరుద్యోగులను వీధిన పడేశారని విమర్శించారు. 200ల యూనిట్ల వరకు ప్రతి ఇంటికి ఉచిత కరెంటు, 500ల రూపాయలకే గ్యాస్ కనెక్షన్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చల్లా మాధవరెడ్డి, హస్మత్‌పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్ పాషా, యాదయ్య, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగల్లి చెన్నయ్య, పామెన నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్ రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, ఆశ్వక్‌అల్లీ, బాల్‌రాజ్, బాస నర్సింహులు, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి చందన చెరువు కట్టపై ఆదివారం పండుగ సాయన్న విగ్రహావిష్కరణ చేయనున్నట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, కాంగ్రెస్ నాయకులు నీలం మధు, కాసాని జ్ఞానేశ్వర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ముదిరాజ్ మహాసభ ప్రతినిధులంతా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

21 నుంచి గ్రామ సభలు

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం అమలు చేయనున్న పలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మున్నీ తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఉదయం 10 గంటల నుంచి సభలు ప్రారంభిస్తామన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అర్హుల ఎంపిక చేపడతామన్నారు. పంచాయతీల స్పెషల్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సభలు ఏర్పాటు చేస్తామన్నారు. 21న చౌదరిగూడ, కాచారం, రాయన్నగూడ, ముచ్చింతల్, పెద్దతూప్ర, 22న జూకల్, మదన్‌పల్లి, మదన్‌పల్లిపాతతండా, ననాజీపూర్, రామంజాపూర్, కవేలిగూడ, సుల్తాన్‌పల్లి, దొడ్డి, 23న మదన్‌పల్లికొత్తతండా, జూకల్, పాల్మాకుల, శంకరాపురం, చెర్లగూడ, 24న పెద్దషాపూర్, కవ్వగూడ, మల్కారం, నర్కూడ, అమ్మపల్లి, జూకల్, పాల్మా కుల రెవెన్యూ గ్రామాల సభలను ఆయా పంచాయతీల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ

మొయినాబాద్: సీపీఐ వంద వసంతాల ఉత్సవాల సందర్భంగా శనివారం చేవెళ్ల మండల పరిధిలోని నారాయణదాసుగూడలో ఆ పార్టీ నాయకులు సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఎర్రజెండాను ఎగురవేసి కమ్యూనిస్టుల పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేస్తుందన్నారు. వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతూ ఉద్యమాలు నడిపింది కమ్యూనిస్టులేనన్నారు. వందేళ్ల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 28న చేవెళ్లలో జరిగే పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎల్లయ్య

హస్తినాపురం: జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 22న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం హస్తినాపురం చౌరస్తాలో జీహెచ్ఎంసీ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించి రెండో పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని అన్నారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బందిని హైకోర్టు తీర్పు ప్రకారం పర్మనెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్లకు రూ.35 వేల వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భాగ్యలక్ష్మీ, రేణుక, ముత్తమ్మ, చంద్రమ్మ, ముత్యాలమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతుభరోసా పథకంలో సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అందుతుందని మండల వ్యవసాయాధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, చౌలపల్లి, చింతగూడ, మధురాపూర్ గ్రామాల్లో ఏఓ రెవెన్యూ అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయం చేసేందుకు అనువుగా ఉన్న భూములకే రైతు భరోసా అందిస్తుందన్నారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లోని భూములను గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తున్నామని, వాటన్నింటి వివరాలను గ్రామంలో నిర్వహించే గ్రామసభలలో చర్చించి ప్రజల ఆమోదం తీసుకుంటామన్నారు. వ్యవసాయేతర భూములుగా మార్చిన వాటికి రైతు భరోసా పథకం వర్తించదన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు సలీం, రోజారాణి, ఏఈఓలు తేజ్‌కుమార్, ప్రణీత, రాంబాబు, మహేందర్‌గౌడ్, గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

మొయినాబాద్‌రూరల్: వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలిస్తున్నామని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నమంగళారం, వీరన్నపేట్, కనకమామిడి గ్రామాల్లో అధికారులు వ్యవసాయ యోగ్యం కాని భూములను పరిశీలించి నమోదు చేశారు. ఈ సందర్భంగా చిన్నమంగళారంలో మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా కనకమామిడిలో మండల వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా కార్యక్రమంలో రైతులకు సంబంధించిన భూములను క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. సాగుకు పనికి రాని భూములను పథకం నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, ఏఓ ప్రవీణ్, సునీల్, చిన్నమంగళారంలో మండల సర్వేయర్ జలజ, ఏఓ కుమార్, రైతులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: గూగుల్ మ్యాప్‌లో భూముల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 20 మందిని ఆపరేషన్ కోసం, మరో 26 మందిని కంటి అద్దాల కోసం గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకొని, కంటి వైద్యులు సూచించిన విధంగా అద్దాలు వాడడం లేదా, అవసరమైన వారు ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా కంటి సమస్యలను దూరం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీసీఐ మేనేజర్ పవన్‌కుమార్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.